పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ: రేపటి తరానికి అందమైన ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతగా భావించాలని యోగివేమన యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో బుధవారం 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా పర్యావరణ పరిరక్షణ నినాదాలు గల ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వైస్ చాన్సలర్ చింతా సుధాకర్, ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి విశ్వవిద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భూమి, నీరు ,గాలి ఉండాలంటే ప్రజల అలవాట్లలో, ఆలోచనల్లో మార్పులు రావాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలకు గల కారణాలు తాజా పరిశోధనల్లో వెలుగులోకి వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఎన్. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణం సంరక్షణ మన అందరి బాధ్యతన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్.పి వెంకటరమణ సీతాకోకచిలుకల ఉద్యాన వనంలో అధిక సంఖ్యలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతామన్నారు. పర్యావరణంలో జీవవైవిధ్యం పాత్ర ఎంతో ఉందన్నారు. మొక్కలతో పాటు కీటకాల సంరక్షణ చేయా లని కోరారు. ఈ కార్యక్రమానికి పర్యావరణ విభాగ సహఆచార్యులు డా. టి. చంద్రశేఖర్, డా. శ్రీధరరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డి, వృక్షశాస్త్ర విభాగం అధ్యాపకులు డా. రాజగోపాల్ రెడ్డి, పరిశోధన విద్యార్థులు, , సిబ్బంది పాల్గొన్నారు . పరిసరాలలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో వీసీ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

క్లుప్తంగా

సన్మాన సభ



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన అహమ్మద్‌బాష సేవలు మరువలేనివని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కడపలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అహమ్మద్‌బాష పదవీ విరమణ సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపకులు కలసి అహమ్మద్‌బాష దంపతులను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్, ఇన్‌చార్జు ప్రిన్సిపాల్ అబీబుల్లా, సీనియర్ అధ్యాపకులు హరిప్రసాద్, ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం సెక్రటరీ చెప్పలి రాజారావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ



చిన్నచౌకులో మారుతీ సుజుకి షోరూం ఎదుట పైపులైన్ లీకేజీతో నిలిచిన నీరు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మద్రాసు రోడ్డులో చిన్నచౌకు నందు మారుతీ సుజుకీ షోరూం ఎదురుగా పైపులైన్ లీకేజీ ఏర్పడింది. ఫలితంగా చాలా రోజులుగా తాగునీరు వృథా అవుతోంది. బండి కనుమ నుంచి కడప నగరానికి నీటిని సరఫరా చేసే ప్రధాన పైపులైన్ కావడంతో నీటి వృథా ఆగడం లేదు. దీంతో నడిరోడ్డుపై గుంత ఏర్పడింది. ఇది వాహనదారులకు కూడా ఇబ్బందిగా మారింది. పైపులైన్‌కు మరమ్మతులు చేసి, రోడ్డుకు మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

పోలతల చైర్మన్ పదవికి రాజీనామా

పెండ్లిమర్రి : పోలతల మల్లేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవికి బుధవారం అంబటి నాగమల్లారెడ్డి రాజీనామా చేశారు. రాజీనామాను అమోదించాలని రాజీనామా పత్రాన్ని ఆలయ ఈఓ శ్రీనువాసులుకు అందజేశారు. ఈవిషయాన్ని దేవాదాయశాఖ కమిషనర్ విజయవాడకు పంపుతామని ఆలయ ఈఓ తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలికి చెందిన ఉపాధిహామి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఆది భాస్కర్ (52)అనారోగ్యంతో మృతి చెందినట్లు ఏపీఓ పార్థసారధి తెలిపారు. రెండు రోజులుగా అనారోగ్యం కారణంగా భాస్కర్ రిమ్స్‌లో చేరారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య వెంకటలక్షుమ్మ, ఇద్దరు అ మ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలున్నారు. విష యం తెలుసుకున్న ఏపీఓ మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎమ్మెల్సీకి ఎమ్మెల్యే కృతజ్ఞతలు

పోరుమామిళ్ల: బద్వేలు అసెంబ్లీ నుంచి రెండోసారి మెజారిటీతో గెలిపించినందుకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం గోవిందరెడ్డి దంపతులను సుధ సన్మానించారు. ఎమ్మెల్సీ కృషి వల్లే తనకు మరోసారి విజయం దక్కిందన్నారు. రాష్ట్రమంతా కూటమికి జై కొట్టగా, బద్వేలులో ప్రజలు తనను గెలిపించారని తెలిపారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి కుమారుడు ఆదిత్యారెడ్డి, కోడలు సాహితీరెడ్డితో పాటు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆకేపాటికి శుభాకాంక్షలు

నందలూరు : రాజంపేట ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆకేపాటి అమరనాథరెడ్డికి బుధవారం ఆకేపాటి ఎస్టేట్‌లో రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథరెడ్డి, ఎంపీపీ మేడా విజయ భాస్కర్ రెడ్డి, నందలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆకేపాటికి శాలువా, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంపీపీ గాలివీటి

వీరబల్లె : ఎన్నికలలో రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందిన ఆకేపాటి అమరనాథరెడ్డిని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి, ఆయతోపాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ప్రస్తుత రాజకీయ పరిణామలపై చర్చించారు.

పర్యావరణం పరిరక్షించాలి

సిద్దవటం: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సిద్దవటం కోర్టు బార్ ప్రెసిడెంటు బి.వెంకటరత్నం అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం సిద్దవటం రేంజర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. వెంకటరత్నం మాట్లాడుతూ కాలుష్యాన్ని నిర్మూలించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి

– ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా

వైవీయూ: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. గౌరవ అతిథిగా విచ్చేసిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ మానవ మనుగడకు పర్యావరణ పరిరక్షణ తప్పనిసరి అన్నారు. కాలుష్యం కలిగించే వస్తువుల వాడకాన్ని, ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. మరో అతిథిగా విచ్చేసిన వైవీయూ బొటానికల్ గార్డెన్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎ. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. జిల్లాలో లభించే అరుదైన, అంతరించి పోతున్న మొక్కల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి కడప ప్రాంతీయ ఇంజినీర్ డాక్టర్ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు పాఠశాల స్థాయి, కళాశాలస్థాయిల్లో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ కాంపిటీషన్స్ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్రం, ఏపీ పొల్యూషన్ బోర్డు అసిస్టెంట్ ఇంజినీర్ అనిల్‌కుమార్‌రెడ్డి, న్యాయనిర్ణేతలు డా. టి. కిరణ్‌కుమార్, డా. పి. సుబ్రమణ్యం, డా. ఎన్. రాజశేఖరరెడ్డి, డా. డి. వీర నరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ప్రిన్సిపాల్ తదితరులు

మొక్కలను సంరక్షించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని శిక్షణా వైద్యులు డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం నాగరాజుపేట అర్బన్ ట్రైనింగ్ సెంటర్‌లో డాక్టర్ ప్రశాంత్ వర్ధన్, హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ట్రైనింగ్ సెంటర్‌లో మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్యారాణి , శిక్షణ వైద్యులు, శివ, నితీష్ కుమార్, రామ్మృష్ణ, శశికిరణ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న డాక్టర్ ప్రశాంత్‌వర్ధన్, సిబ్బంది

పర్యావరణ రక్షణతోనే మానవాళి జీవనం

కడప కల్చరల్ : పర్యావరణాన్ని రక్షించినపుడే భూమిపై మానవాళి జీవనం సాధ్యమవుతుందని భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని పలు స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో చిన్నపరెడ్డి ఈ సందర్భంగా పర్యావరణంపై ప్రత్యేకంగా ప్రచురించిన రెండు రకాల బ్రోచర్లను విడుదల చేశారు. ఇంటాక్ సంస్థ సీనియర్ సభ్యులు లయన్ కె.సంజీవరెడ్డి, న్యాయవాది భారవి, సభ్యులు రాఘవేంద్రవర్మ పాల్గొన్నారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న చిన్నపరెడ్డి తదితరులు

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం

ప్రొద్దుటూరు కల్చరల్ : నైతిక విలువలు పెంపొందించడంతోనే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యమని విశ్రాంత వైమానిక దళ అధికారి వెంకట కొండయ్య పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించు కోవాలని సూచించారు. స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులకు నీతి కథలు వివరించారు. చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలు, పెద్దల పట్ల గౌరవం కలిగి ఉండాలని, చదువు ప్రాముఖ్యతను తెలిపారు. చిన్నారులకు ఈ సందర్భంగా ఖోఖో ఆటలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నిర్మలజ్యోతి, రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు : 2024-25 విద్యాసంవత్సరానికి 6, 9వ తరగతులలో మిగిలిఉన్న ఖాళీలను భర్తీచేయడం కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహాత్మాజ్యోతిరావుపూలే కన్వీనర్ రామకృష్ణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు, కమలాపురంలలో ఉన్న బాలుర, వనిపెంట, తొండూరు బాలికల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఇంగ్లీషుమీడియం స్టేట్ సిలబస్ బోధించబడుతుంది. స్టేట్ సిలబస్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులనుంచి ప్రవేశానికి దరఖాస్తులు కోరడమైంది. ఈనెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలనుంచి ఐదున్నర వరకు నందలూరులోని జ్యోతిరావుపూలే గురుకుల పాఠశాలలో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈనెల 15వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుని హాల్ టిక్కెట్‌లను ఇంటర్నెట్‌ల ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావాలన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలి

ప్రొద్దుటూరు : నూతన ప్రభుత్వం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలని ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు కోరారు. బుధవారం ప్రొద్దుటూరులో వారు మాట్లాడుతూ పరిశ్రమను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను, పరిశ్రమలను, యూనివర్సిటీలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

బాల్యం నుంచే పర్యావరణ స్పృహ అవసరం

కడప కల్చరల్ : నేటి సమాజంలో బాల్యం నుంచే పర్యావరణ స్పృహ అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనూరాధ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక పర్యావరణ మిత్ర సమూహం సంస్థ ప్రతినిధి ప్రసాదురెడ్డి నగర పాలక సంస్థ సహకారంతో విద్యార్థులకు పర్యావరణంపై చిత్రలేఖన పోటీలను నిర్వహించింది. ఐటీఐ సమీపంలోని భగత్‌సింగ్ పార్కులో జరిగిన ఈ కార్యక్రమానికి దాదాపు 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమానికి డీఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులను సులభంగా ఆకర్షించే చిత్రకళ ద్వారా పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు మిత్ర సమూహం సంస్థ చేస్తున్న కార్యక్రమాలను ఆమె అభినందించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మృత్యుంజయరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. సర్వశిక్ష అభియాన్ అధికారి ఎం.కేశవరెడ్డి, నగర పాలక సంస్థ ఏడీ అనిల్‌కుమార్, ఇంటాక్ సభ్యులు కె.బాలయల్లారెడ్డి, డాక్టర్ సాయిప్రసాద్, పలువురు నగర ప్రముఖులు, పర్యావరణ మిత్ర సభ్యులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన చిత్రలేఖన పోటీలో జూనియర్స్ విభాగంలో ఎస్.జాసిమ్, షేక్ సఫా మిస్బా, జీవన్ రాజ్‌లు తొలి మూడు బహుమతులు సాధించగా, టి.లేక్షణ, పి.హిమశ్రీలు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారు. సీనియర్స్ విభాగంలో వై.రుద్రతేజ, ఎం.శివనరసింహా, డి.ధనుంజయ తొలి మడు బహుమతులు అందుకోగా, ఎ.నాగలహరి, కె.మమత కన్సోలేషన్ బహుమతులు పొందారు. డీఈఓ అనూరాధ, ఇతర ప్రముఖులు వారికి నగదు బహుమతులతోపాటు ప్రశంసాపత్రాలను అందజేసి ప్రశంసించారు.



తాము గీసిన చిత్రాలతో చిన్నారులు, అతిథులు

మొక్కలతోనే మానవాళి మనుగడ

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు బుధవారం కడప నగరంలో మొక్కలు నాటారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థ స్పెషల్ ఆఫీసర్ జి.శివశంకర్ రెడ్డి ఎర్రముక్కపల్లె ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆవరణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. సీనియర్ మేనేజర్ వసంత , రెడ్‌క్రాస్ జిల్లా కో ఆర్డినేటర్ సుధాకర్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

– ఇంటాక్, శ్రీ పుష్పగిరి తీర్థ క్షేత్ర పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు భారవి, సభ్యులు రాఘవేంద్రవర్మ బుధవారం స్థానిక రిమ్స్ వద్దగల పుష్పగిరి కంటి ఆస్పత్రి, రిమ్స్ ఆస్పత్రి ప్రాంతాల్లో పలు రకాల పండ్ల మొక్కల విత్తనాలు నాటారు. డాక్టర్ సూర్యప్రకాశ్‌తోపాటు ఇతర అతిథులు విత్తనాలను నాటారు.



మొక్కను నాటుతున్న జి.శివశంకర్‌రెడ్డి

– బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక టెలికాం నగర్‌లోని దాదాపు ప్రతి ఇంటి వద్ద సంస్థ ప్రతినిధులు మొక్కలు నాటారు. తమ ఇళ్ల వద్ద ఉన్న మొక్కలను రక్షించిన వారికి సంవత్సరం తర్వాత మంచి బహుమతి అందజేస్తామని సంస్థ అధ్యక్షులు మేరువ బాలాజీరావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రమణారెడ్డి, మంజునాథ్, శివప్రసాద్, రాఘవేంద్రారెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు

కొత్తగా బీఎస్సీ హానర్స్ బాటనీ కోర్సు

వేంపల్లె : 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ హెల్ప్ డెస్క్ ద్వారా డిగ్రీ ప్రవేశానికి ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ కళాశాల ఏర్పాటైన మూడేళ్ల సందర్భంగా ఐదు కోర్సులకు అదనంగా కొత్తగా బీఎస్సీ హానర్స్ బాటనీ కోర్సును అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని వేంపల్లె పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే బీఏ హిస్టరీ, బికామ్ కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, మాథ్స్, కెమిస్ట్రీ కోర్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10 మంది పీహెచ్‌డీ కలిగిన అధ్యాపకుల బృందంతో బోధన జరుగుతుందన్నారు. అలాగే ఎన్ఎస్ఎస్, స్పోర్ట్సు అండ్ గేమ్స్, రెడ్ రిబ్బన్, క్యాంపస్ డ్రైవ్‌తో పాటు ఆధునిక పద్ధతుల్లో బోధన నిర్వహించబడుతుందన్నారు. కళాశాల నుంచి దాదాపు 150 మంది విద్యార్థులు డిగ్రీ ఉత్తీర్ణులై కడప, బెంగుళూరు నగరాల్లోని ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు పొంది ఉన్నారన్నారు.

లింగ వివక్ష విడనాడాలి



కమలాపురంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

కమలాపురం : లింగ వివక్ష విడనాడాలని, భవిష్య త్తు అమ్మాయిలదేనని పెద్ద చెప్పలి పీహెచ్‌సీ మెడిక ల్ ఆఫీసర్ మహినూర్ తెలిపారు. బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని కిషోర బాలికలకు, తల్లులకు లింగ వివక్ష పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో లింగ వివక్ష విడనాడాలన్నారు. లింగ నిర్ధారణ చేయడం నేరమని, చేయించుకున్న వారికి, చేసే వారికి జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదన్నారు. అలాగే లింగ నిర్ధారణ చేసే ఆసుపత్రుల అనుమతులు రద్దు చేసి మూసివేస్తామన్నారు. సమాజంలో మహిళలు, పురుషులు సమానం అని, భవిష్యత్తు అంతా అమ్మాయిలదేనన్నారు. ఆడపిల్లలను రక్షి ద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం..అని ప్రమాణం చే యించారు. కార్యక్రమంలో ఆరోగ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, షంషాద్, సుబ్బ మ్మ, భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు. అలాగే కమలాపురం పట్టణంలోని 7వ వార్డు అంగాన్‌వాడీ కేంద్రంలో 1వ సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీలు నిర్వ హించిన సమావేశంలో ఎంఎస్‌కే పద్మజ, ఏఎన్ఎం ధనలక్ష్మీలు తల్లులకు లింగ వివక్ష పట్ల అవగాహన కల్పించారు. నేటి ఆడపిల్లే రేపటి అమ్మ అని, ఈ రోజు ఆడపిల్లను వద్దనుకుంటే ఓ తల్లిని, ఓ సోదరిని, ఓ స్నేహితురాలిని, ఓ భార్యను, ఓ బామ్మని కో ల్పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, తల్లులు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు విక్రయించాలి

వేంపల్లె : ఖరీఫ్ సాగు కోసం రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్ ఎరువుల దుకాణ యజమానులకు సూచించారు. బుధవారం మండల కేంద్రమైన వేంపల్లెలోని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆయన తనిఖీ నిర్వహించారు. అలాగే విత్తనాలకు సంబంధించి స్టాక్ నిలువ రికార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 2024-25 ఖరీఫ్ సీజన్‌లో భాగంగా ఎక్కడా కూడా నకిలీ విత్తనాలు అమ్మరాదని, అలాగే విక్రయ రసీదును రైతులకు ఖచ్చితంగా ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, దుకాణ యజమానులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి రాజేంద్రప్రసాద్

కన్నుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరుడు



హోమంలో పూర్ణాహుతి సమర్పిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో బధవారం మాస శివరాత్రి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌లకు విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. గణపతి, నవగ్రహ, రుద్రహోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి ఆలయ ప్రాంగణం కాలక్షేప మండపంలోని వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవోపేతంగా కల్యాణోత్సవాన్ని జరిపారు. కార్యక్రమానంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాగా గురువారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ఉజ్జయిని మహాకాళేశ్వరుని వలే పూజా, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు భస్మహారతి జరుగనుంది. కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ కోరారు.